పేదలకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు: వజ్రేష్‌యాదవ్‌



మాట్లాడుతున్న తోటకూర వజ్రేష్‌యాదవ్‌ తదితరులు

కీసర: కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో అర్హత కలిగిన పేదలకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లను అందించడం జరుగుతుందని మేడ్చల్‌ నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ అన్నారు. నాగారం సుర్వీ బాబయ్య ఫంక్షన్‌హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఏర్పాటుకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. కాంగ్రెస్‌ నేతలకు, నాయకులకు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ దిశానిర్దేశం చేయడంతోపాటు, కమిటీ ఏర్పాటు, లబ్ధిదారుల ఎంపీకకు సంబంధించి పరిగణలోకి తీసుకునే అంశాలను తెలియజేశారు. సమావేశంలో మేడ్చల్‌జిల్లా కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, బీబ్లాక్‌ అధ్యక్షులు మహేష్‌గౌడ్‌, కీసర మండల అధ్యక్షుడు కృష్ణాయాదవ్‌, నాగారం మున్సిపల్‌ అధ్యక్షుడు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్‌డీ మహా సభలు విజయవంతం చేయాలి



విరాళాలు సేకరిస్తున్న ఎన్‌పీఆర్‌డీ నాయకులు

ఘట్‌కేసర్‌: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) 4వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌ కోరారు. ఈ నెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో జరిగే ఎన్‌పీఆర్‌డీ మహా సభలు విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో గురువారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వికలాంగులకు జరుగుతున్న అవమానాలు, మహిళలపై జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. వికలాంగులకు రెండు పడకల ఇళ్లు, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సభలకు పెద్ద ఎత్తున వికలాంగులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సీరజారెడ్డి, ఎల్లమ్మ, రఘు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



ఘట్‌కేసర్‌: విధుల సమయం మార్చొద్దని కోరుతూ పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం రెండు పూటల విధులు నిర్వహించాలనడం అన్యాయమన్నారు. గతంలో ఉన్న విధంగానే ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తామని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో మున్సిపల్‌ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్‌ పార్కు పనులకు శంకుస్థాపన



పార్కు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్‌ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీలోని 7వ వార్డు రాజీవ్‌ గృహకల్పలో రూ. 6 లక్షలతో నిర్మిస్తున్న చిల్డ్రన్స్‌ పార్కు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా చైర్మన్‌ కొండల్‌రెడ్డి హాజరై పార్కు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ మాట్లాడుతూ.. పార్కులో చిన్నారులకు ఆట వస్తువులు, వాకింగ్‌ ట్రాక్‌ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ రెడ్యానాయక్‌, కౌన్సిలర్‌ శైలజారెడ్డి, బాల్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నీటిని పరిశీలించిన పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు అధికారులు



నీటి శ్యాంపిల్స్‌ సేకరిస్తున్న అధికారులు

పోచారం: మున్సిపాలిటీలోని నారపల్లి పెద్దచెరువు నీటిని పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు అధికారులు గురువారం పరిశీలించారు. చెంగిచెర్ల కబేలా వ్యర్థాలతో నారపల్లి చెరువు, అన్నోజీగూడలో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని గతంలో చైర్మన్‌ కొండల్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్‌, పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు సభ్యుడు శరత్‌చంద్రారెడ్డికి వినతి అందజేశారు. ఆయన ఆదేశం మేరకు అధికారులు నీటిని పరిశీలించి శ్యాంపిల్స్‌ సేకరించారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ రెడ్యానాయక్‌, కమిషనర్‌ వీరారెడ్డి, కౌన్సిలర్‌ రవీందర్‌గౌడ్‌, కోఆప్షన్‌ సభ్యుడు అక్రమ్‌ అలీ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంతల సమాచారం

మేడ్చల్‌: మున్సిపాలిటీ పరిధిలో ప్రతివారం కూరగాయాలు, ఇతర సామగ్రి విక్రయించేవారంతపు సంతల సమాచారం..

సోమవారం – రైల్వే స్టేషన్‌ రోడ్డు (పోలీస్‌ క్వార్టర్స్‌ రోడ్డు), అత్వెల్లి మంగళవారం – ఉమానగర్‌, కేఎల్‌ఆర్‌ విజయానగర్‌
బుధవారం – ఎన్‌జీటీస్‌ కాలనీ (మేడ్చల్‌)
గురువారం – వీకర్‌ సెక్షన్‌ కాలనీ (జెడ్పీహెచ్‌ఎస్‌ స్కూల్‌ వద్ద)
శుక్రవారం – సూర్యానగర్‌, చంద్రానగర్‌
శనివారం – హౌజింగ్‌బోర్డ్‌ కాలనీ, కిష్టాపూర్‌, చెక్‌పోస్టు, ఆర్టీసీ కాలనీ
ఆదివారం – ప్రధాన మార్కెట్‌

పంచాయతీ ఎన్నికలు జరిగేనా?

మేడ్చల్‌: దసరా పండగ తర్వాత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి సర్పంచ్‌లను ఎన్నుకోవాలని వడివడిగా పనులు చేస్తుంటే మేడ్చల్‌ నియోజకవర్గంలో ఎన్నికలు ఉంటాయా లేదా తెలియకపోవడంతో అనిశ్చితి ఏర్పడింది. గత ఐదెళ్ల క్రితం మేడ్చల్‌ నియోజకవర్గంలో 62 గ్రామ పంచాయతీలుండగా ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్‌ విస్తరణ పేరుతో 28 గ్రామాలను 7 మున్సిపాలిటీలలో విలీనం చేసింది. మిగిలింది మూడు మండలాలు.. 33 గ్రామాలు, 5 మండల పరిషత్‌లు, మూడు జిల్లా పరిషత్‌లు ఉన్న మేడ్చల్‌ నేడు మూడు మండలాలకు పరిమితమైంది. గ్రామాల విలీనంతో జిల్లా పరిషత్‌, మండల పరిషత్‌ వ్యవస్థను పూర్తిగా కోల్పొయే ప్రమాదంలో ఉంది. మేడ్చల్‌, శామీర్‌పేట్‌, మూడు చింతలపల్లి మండలాలే మిగలగా కీసర, ఘట్‌కేసర్‌ మండలాలు కనుమరుగై కేవలం రెవెన్యూ మండలాలుగానే ఉండనున్నాయి. తాజాగా మూడు మండలాల్లో కలిపి 33 గ్రామాలు మాత్రమే గ్రామ పంచాయతీలుగా ఉండనున్నాయి. మిగిలిన 33 గ్రామాలకు పంచాయతీ ఎన్నికలు ఉంటాయా? ఉండవా తెలియక ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచనలో ఉన్న నాయకులు తీవ్రంగా మదన పడుతున్నారు. మున్సిపాలిటీల్లో విలీన ప్రక్రియ ముగియడంతో మేడ్చల్‌ మండలంలో 13 గ్రామాలు, శామీర్‌పేట్‌ మండలంలో 7 గ్రామాలు, మూడు చింతలపలిల్లో 13 గ్రామాలు ఉన్నాయి. 33 గ్రామాల భవిష్యత్‌ పై జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

ఏర్పాట్లు చేస్తున్న అధికారులు..

ఎన్నికల ప్రక్రియలో భాగంగా పంచాయతీ రాజ్‌ అధికారులు ఎన్నికల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. అఖిలపక్ష నాయకుల సమావేశాలు, గ్రామాల్లో వార్డుల వారిగా ఓటరు జాబితా ప్రకటనలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటరు జాబితా సవరణలో మార్పులు, చేర్పులు వంటి పనులు చేపడుతున్నారు.

స్పష్టత లేదు..

మేడ్చల్‌ నియోజకవర్గంలో మిగిలిన 33 గ్రామ పంచాయతీలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల లోపు ఎన్నికలు ఉంటాయా లేదా అనే విషయం పాలకుల్లో, అధికారుల్లో స్పష్టత లేకుండా పోయింది. అధికారులు మాత్రం తాము ప్రభుత్వం చెప్పిన విధంగా నిరంతర ప్రక్రియలు సాగిస్తున్నామని ఎన్నికలు ఉంటాయా ఉండవా అనే విషయాన్ని తాము చెప్పలేమని చెబుతున్నారు. అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం తమకు ఎలాంటి సమాచారం అందడం లేదని వాపోతున్నారు.

'విలీనం'తో భారీగా తగ్గిన పంచాయతీలు



మున్సిపాలిటీలా..గ్రామ పంచాయతీలా..

మేడ్చల్‌ నియోజకవర్గంలోని ఘట్‌కేసర్‌, కీసర మండలాల్లో గ్రామ పంచాయతీలు లేకుండా పోయాయి. రెండు మండలాలు ఘట్‌కేసర్‌, పోచారం, దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీలుగా ఉన్నాయి. మేడ్చల్‌ మండలంలో 13, మూడు చింతలపల్లి మండలాల్లో 13 గ్రామాలు ఉండగా శామీర్‌పేట్‌ మండలంలో 7 గ్రామాలు ఉన్నాయి. ఈ మండలాల్లోని గ్రామాలను మున్సిపాలిటీలుగా మారుస్తారా అనే విషయం పై స్పష్టత లేకుండా పోయింది. మేడ్చల్‌ మండలంలో మిగిలిన 13 గ్రామాలను డబీల్‌పూర్‌, రావల్‌కోల్‌ కేంద్రాలుగా రెండు మున్సిపాలిటీలు, శామీర్‌పేట్‌, మూడు చింతలపల్లి గ్రామాలను కలిపి అలియాబాద్‌, మూడు చింతలపల్లి కేంద్రాలుగా రెండు మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తున్నారనేది విశ్వసనీయ సమాచారం. మొత్తం మీద మేడ్చల్‌ నియోజకవర్గంలో గ్రామ పంచాయతీకు ఎన్నికలు ఉంటాయా లేదా అనేది సమాధానం లేని చర్చగా మారింది.

చదువు మీది.. ఫీజు బాధ్యత నాది

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



విద్యార్థినికి మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే బండారి

ఉప్పల్‌: 'చదువు మీది ఫీజు బాధ్యత నాది' అనే నినాదంతో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భరోసా ఇస్తున్నారు. చదువుల్లో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ఆపన్న హస్తం అందిస్తూ గురువారం ఉప్పల్‌ చిలుకానగర్‌, మల్లికార్జుననగర్‌ ప్రాంతానికి చెందిన ఒరుసు యాదమ్మ, ఈదయ్యల కుమార్తె నందినికి స్థానిక కార్పొరేటర్‌ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి ఆర్థికసాయం చేస్తానని హామీ ఇచ్చారు. నందిని నీట్‌ ప్రవేశపరీక్షలో రాష్ట్రస్థాయి ఎంబీబీఎస్‌లో ర్యాంక్‌ సాధించడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కార్పొరేటర్‌ బన్నాల గీత ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే నందిని ఐదేళ్ల ఫీజును చెల్లిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థినికి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం



ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పరశురాంను మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనురాధా, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్‌, నర్సింగ్‌రావు, కోఆప్షన్‌ సభ్యుడు షౌకత్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్‌గౌడ్‌, సిరాజ్‌ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు చెల్లించాలి



ఈసీఐఎల్‌లో నిరసన ర్యాలీలో విద్యార్థులు

కాప్రా: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు సత్వరమే చెల్లించాలని ఏఐవైఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర అన్నారు. గురువారం ఏఐవైఎఫ్‌ ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్‌ కార్యాలయం నుంచి ఈసీఐఎల్‌ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌ సర్కార్‌ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉన్నత విద్యారంగాన్ని అభివృద్ధి చేసి, మేధోసంపతిని పెంచాల్సిన పాలకులు విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఏఐవైఎఫ్‌ నాయకులు సత్యప్రసాద్‌, గిరిబాబు, శేఖర్‌, మహేష్‌, సాహైల్‌, అజీమ్‌పాషా, ఆర్తి, అస్మా, దేవి, సంధ్య, నీలిమ, మధురిమ, కీర్తన, నయన, స్వాతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు



బైక్‌ను ఢీకొట్టిన కారు, కింద పడిన సత్తార్‌

ఘట్‌కేసర్‌: బైక్‌ను వెనక నుంచి ఓ కారు వేగంగా ఢీకొట్టడంతో వాహనదారుడి కాలు విరిగిన సంఘటన ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంకుషాపూర్‌ గ్రామానికి చెందిన మహమ్మద్‌ సత్తార్‌ టీవీఎస్‌ ఎక్‌ఎల్‌ ద్విచక్రవాహనంపై అవుషాపూర్‌ వైపు వెళ్తుండగా గ్రీన్‌ పార్కు వద్దకు రాగానే టీఎస్‌05–యూసీ 1637 నెంబర్‌ కారు వెనకాల నుంచి వేగంగా వచ్చి మహమ్మద్‌ సత్తార్‌ బైక్‌ను ఢీకొట్టడంతో, అతడు కిందపడి కుడి కాలు విరిగింది. చికిత్స నిమిత్తం వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టామన్నారు.

పటేల్‌కుంట చెరువు పరిశీలన

మల్లాపూర్‌: రూ. కోటి 80 లక్షలతో నాచారం పటేల్‌కుంట చెరువు వద్ద నిర్మించిన సివరేజ్‌ డైవర్షన్‌ పైపులైన్‌ను వాడుకలోకి తీసుకురావాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఇరిగేషన్‌ అధికారులను ఆదేశించారు. గురువారం నాచారం పటేల్‌కుంట చెరువును ఇరిగేషన్‌ అధికారులతో కలిసి సందర్శించారు. చెరువు చుట్టూ బండు నిర్మించి వాకింగ్‌ ట్రాక్‌ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచనలు చేసినట్లు సమాచారం. అనంతరం గుర్రపు డెక్కా తొలగించేందుకు ఎఫ్‌టీసీ యంత్రాన్ని ప్రారంభించారు. చెరువుకు ఆనుకుని ఉన్న ఎరుకుల బస్తీ వాసుల ఇళ్లు హైడ్రా వల్ల ఇళ్లు ఏమి పోవని వారికి భరోసా ఇచ్చారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌శేఖర్‌, ఇరిగేషన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ నారాయణ, ఏఈఈ సుధీర్‌ తదితరులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

వాల్‌పోస్టర్‌ ఆవిష్కరణ

మల్లాపూర్‌: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్‌ 5న నిర్వహించబోయే చలో హైదరాబాద్‌ మహాధర్నా వాల్‌పోస్టర్‌ను బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ఆవిష్కరించారు. బీఆర్‌టీయూ ఆటో యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబుయాదవ్‌, ఉపాధ్యక్షులు రమేష్‌, హైమద్‌ బాయ్‌, రామకృష్ణ తదితరులున్నారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులు

మల్కాజిగిరి: ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ కస్తూరిబానగర్‌లో రూ. 20 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ ప్రారంభించారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కాలనీల్లో యూజీడీ, తాగునీటి పైపులైన్లు పూర్తయిన వీధుల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్త రహదారులను నిర్మిస్తున్నామన్నారు. ఏఈ శ్రీకాంత్‌, వీఐ రజనీకాంత్‌, నాయకులు బాబు, సత్యనారాయణ, ఉమేష్‌సింగ్‌, కిషోర్‌, హబీబ్‌, బషీర్‌, సుధాకర్‌, నారాయణ పాల్గొన్నారు.



పనులు ప్రారంభించిన కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నర్సింహులు

మేడ్చల్‌: నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మేడ్చల్‌ మార్కెట్‌ కమిటీ పాలకవర్గం కమిటీ పరిధిలోని రైతులకు నాణ్యమైన సేవలు అందించి రైతు అభివృద్ధి కోసం కృషి చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ అన్నారు. కండ్లకోయలోని మార్కెట్‌ కమిటీ కార్యాలయంలో నూతన పాలకవర్గం పదవీ స్వీకరణోత్సవంకు హాజరై అభినందించారు. నూతన చైర్మన్‌ నర్సింహులు యాదవ్‌ పాలకవర్గం రైతులకు మెరుగైన సేవలు చేస్తూనే మార్కెట్‌ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మెరుగైన వసతులు కలిపిస్తూ ప్రభుత్వంకు మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత, చర్లపల్లి కార్పొరేటర్‌ శ్రీదేవి, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

హడావుడిగా కార్యక్రమం..

మేడ్చల్‌ మార్కెట్‌ కమిటీ నూతన పాలకవర్గం ప్రకటన చేసినప్పటి నుంచి నియోజకవర్గ కాంగ్రెస్‌లో అసంతృప్తి చెలరేగింది. నూతన కమిటీని రద్దు చేయాలని అధిష్టానంకు ఫిర్యాదులు అందాయి. దీంతో అట్టహాసంగా నిర్వహించాల్సిన పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని కమిటీ కార్యాలయంలో నామమాత్రంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రధాన నాయకులు, మేయర్లు, చైర్మన్లు, కౌన్సిలర్లు, పట్టణ, మండల కమిటీల అధ్యక్షులు సైతం కార్యక్రమానికి రాలేదు. కార్యక్రమాన్ని నాలుగు గోడల మధ్య ముగించడంతో సగటు కాంగ్రెస్‌ కార్యకర్త ప్రశ్నించడంతో తర్వాత అట్టహాసంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కొంతమంది నాయకులు చెప్పినప్పటికీ.. సమయం ఆలస్యమైతే ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయోనని ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని హడావుడిగా నిర్వహించారని కాంగ్రెస్‌ నాయకులు వెల్లడించారు.

ఆకట్టుకున్న జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌



కళా ఉత్సవ్‌ విజేతలతో జిల్లా విద్యాధికారి విజయకుమారి

ఘట్‌కేసర్‌: ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ ఫైన్‌ ఆర్ట్స్‌ స్కూల్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌ ఆకట్టుకుంది. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పలు అంశాల్లో పోటీ పడ్డారు. వాయిద్యంలో సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థి రిషివన్‌, డ్యాన్స్‌లో తూంకుంట జెడ్పీ విద్యార్థులు సాయి హర్షిత్‌ బృందం, వోకల్‌లో సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థుల బృందం, ట్రెడిషనల్‌ స్టోరీ టెల్లింగ్‌లో సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థులు, విజువల్‌ ఆర్ట్స్‌లో సాంఘీక సంక్షేమ గురుకుల్‌ విద్యార్థులు రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి విజయకుమారి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంఈఓ శ్రీధర్‌, నోడల్‌ అధికారి పాపిరెడ్డి, కాంప్లెక్స్‌ శ్రీరాములు, ఏఎంఓ రవీందర్‌రాజు, ప్రిన్సిపల్‌ మధులత, అధ్యాపకులు రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



కమ్యూనిటీహాల్‌ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్‌

బోడుప్పల్‌: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. 15వ డివిజన్‌ రాజలింగం కాలనీ ఫేస్‌ – 2లో రూ. 20 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్‌ నిర్మాణం , మరో రూ.6లక్షలతో అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దశల వారీగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభించిన పనులను త్వరతిగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. 15వ డివిజన్‌ కార్పొరేటర్‌ కొత్త దుర్గమ్మగౌడ్‌, కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ నియోజకవర్గ బీ–బ్లాక్‌ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడమే లక్ష్యం

ఉప్పల్‌: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా కృషి జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్‌లో నిర్వహించిన ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే విధంగా కమిటీలను అందజేయాలని నేతలకు సూచించారు. పలువురు సీనియర్‌ కాంగ్రెస్‌ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకీ జయంతి వేడుకల్లో చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య, కౌన్సిలర్లు



నాగారంలో.. వాల్మీకి జయంతి వేడుకలు

ఘట్‌కేసర్‌: పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయం ఆవరణలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీ జంగయ్య, కమిషనర్‌ సాబేర్‌ అలీతో కలిసి హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ.. హిందూ ఇతిహాసం రామాయణాన్ని అందించాడన్నారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డి, కౌన్సిలర్లు అనురాధా, నర్సింగ్‌రావు, కోఆప్షన్‌ సభ్యుడు షౌకత్‌, మేనేజర్‌ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, విజయ్‌గౌడ్‌ పాల్గొన్నారు.

కీసర: రామాయణాన్ని రచించి ఆది కవిగా పేరు ప్రఖ్యాతలు గావించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, ప్రణీతాగౌడ్‌, వైస్‌ చైర్మన్లు మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బండారి మల్లేష్‌యాదవ్‌, కమిషనర్‌ నాగమణి, మున్సిపల్‌ మేనేజర్‌ చంద్రశేఖర్‌, కౌన్సిలర్లు, మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకొని మేయర్‌ శాంతి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్‌ శాంతి మాట్లాడుతూ.. వాల్మీకి చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, ధర్మాన్ని అనుసరించి మానవుడు ఎలా జీవించాలో దిశానిర్దేశం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు లలితాయాదవ్‌, రవి, నవీన్‌ కుమార్‌, మేనేజర్‌ నగేష్‌, నాయకులు, మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి,సిటీబ్యూరో: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్‌, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాసిన్‌ అలీ, అడ్మినిస్ట్రేటీవ్‌ ఆఫీసర్‌ హనుమంత్‌, వాల్మీకి సంఘం అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షులు రాములు, జనరల్‌ సెక్రటరీ, వాల్మీకి సంఘం నాయకులు వెంకటరమణ, లక్ష్మణ్‌, తదితరులు పాల్గొన్నారు.

